సాక్షి చిత్తూరు

1

గురువారం । 2 । అక్టోబర్ । 2025



న్యూస్‌రీల్

నేడు మద్యం.. మాంసం విక్రయాల నిషేధం

చిత్తూరు అర్బన్ : గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం జిల్లాలో ఎక్కడా కూడా మద్యం అమ్మకాలు నిర్వహించొద్దని చిత్తూరు జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. బార్లలో కూడా మద్యం అమ్మకాలు ఉండొద్దని.. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇక చిత్తూరు నగరంలో ఎక్కడా మాంసం విక్రయాలు చేయకూడదని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ తెలిపారు. మున్సిపల్ జంతు వధశాల, చేపల మార్కెట్‌ను సైతం మూసి ఉంచనున్నట్లు పేర్కొన్నారు.

జిల్లాకు రెండు కేంద్రీయ విద్యాలయాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో రెండు కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు ఈనెల 1న ఆర్థిక వ్యవహారాల కేబినేట్ కమిటీ ఆమోదం తెలిపినట్లు ప్రకటించారు. కొత్తగా ప్రకటించిన కేంద్రీయ విద్యాలయాల జాబితాలో చిత్తూరు జిల్లా కేంద్రంలోని మంగసముద్రం వద్ద ఒకటి, కుప్పం మండలంలోని బైరుగానిపల్లి వద్ద మరొకటి మంజూరయ్యాయి. మంజూరైన కేంద్రీయ విద్యాలయాలకు నూతన భవనాలను నిర్మించే వరకు తాత్కాలిక భవనాల్లో తరగతులు నిర్వహించే అవకాశం ఉంది. మొదట్లో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు తరగతులు ప్రారంభించే అవకాశాలున్నాయి. ఆ తర్వాత అదనపు తరగతులు పెంచుకుంటూ వెళ్తారు. ఇలా ఇంటర్ వరకు కేంద్రీయ విద్యాలయాల్లో బోధన చేస్తారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి తరగతులు ప్రారంభించే అవకాశాలు ఉంటాయని అధికారులు వెల్లడిస్తున్నారు.

రేపటి నుంచి డీఎస్సీ అభ్యర్థులకు శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన కేంద్రాల్లో ఈనెల 3వ తేదీ నుంచి 10 వరకు డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ నిర్వహించనున్నట్లు డీఈవో వరలక్ష్మి వెల్లడించారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎంపిక చేసిన కేంద్రాల్లో 8 రోజుల పాటు నిర్వహించే శిక్షణకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ శిక్షణలో పాల్గొనే అభ్యర్థులు తప్పనిసరిగా సూచనలు పాటించాలన్నారు. శిక్షణ కార్యక్రమం రెసిడెన్షియల్ విధానంలో జరుగుతుందన్నారు. కొత్తగా ఎంపికైన టీచర్లందరూ కచ్చితంగా హాజరు కావాలన్నారు. గైర్హాజరైతే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. శిక్షణ పొందే వారికి మాత్రమే కౌన్సెలింగ్ ఉత్తర్వులు జారీ చేస్తారని వెల్లడించారు. శిక్షణ కార్యక్రమానికి ప్రతి అభ్యర్థి అధునాతన ఆండ్రాయిడ్ ఫోన్ తెచ్చుకోవాలన్నారు. నియామకపత్రం కచ్చితంగా తెచ్చుకోవాలన్నారు.

మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎంహెచ్ఓ సుధారాణి

ఐరాల : స్వస్థ్ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎంహెచ్ఓ సుధారాణి ఆదేశించారు. బుధవారం కాణిపాకం పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు నమోదు, వివిధ రకాల ఆరోగ్య సేవల రికార్డులు, స్కానింగ్ పరికరాల నిర్వహణపై తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్యంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. దీనిలో భాగంగా ప్రత్యేక వైద్య శిబిరాల్లో మహిళలకు అందిస్తున్న వైద్య సేవలు అన్ని రకాల యాప్‌లో నమోదు చేయాలని వైద్యాధికారి స్వాతి సింధూరకు సూచించారు. పీహెచ్‌సీలో ప్రసవాల సంఖ్య పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆస్పత్రి ఆవరణలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్‌గా సచ్చిదానందమూర్తి



తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్‌చార్జిగా ప్రొఫెసర్ సచ్చిదానందమూర్తిని నియమిస్తూ వీసీ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు పరీక్షల నియంత్రణ అధికారిగా పనిచేసిన డాక్టర్ కంభంపాటి సాంబశివమూర్తి ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ సాంబశివమూర్తి సేవలను కొనియాడారు. అనంతరం సచిదానందమూర్తికి అభినందనలు తెలిపారు.

మనోరథం తీరేలా..

కల్కి కటాక్షం







బ్రహ్మోత్సవ వేళ.. బ్రహ్మాండనాయకుని దర్శించిన వారిది కదా భాగ్యము.. భువి వైకుంఠంలో అడుగిడిన వారిది కదా పుణ్యము.. ఆనంద నిలయంలో దేవదేవుని కనులారా కాంచిన వారి జన్మము కదా ధన్యము.. మహిమాన్విత రథంపై మాడవీధుల్లో ఊరేగుతున్న శ్రీమలయప్పస్వామివారిని సేవించిన వారు కదా పునీతము.. గోవింద నామస్మరణతో పులకించిన వారిది కదా ముక్తిమార్గము.. అశ్వవాహనంపై కల్కి అవతారంలో విహరిస్తున్న అలంకారప్రియుని కటాక్షం పొందిన వారి జీవితము కదా చరితార్థము.

- అంగరంగ వైభవంగా శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు
- రథంపై ఊరేగిన దేవదేవేరులు
- అశ్వవాహనంపై విహరించిన శ్రీమలయప్పస్వామివారు
- నేడు చక్రస్నానం.. ధ్వజావరోహణం

తిరుమల : శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. బుధవారం ఉదయం శ్రీమలయప్పస్వామివారి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. ఉభయ దేవేరులతో కూడిన వైకుంఠనాథుడు చతుర్మాడ వీధుల్లో రథంపై ఊరేగారు. శ్రీనివాసుని దివ్యదర్శనంతో భక్తులు పులకించారు. రథోత్సవంలో దేవదేవుడిని సేవించిన వారికి పునర్జన్మ ఉండదని పురాణాల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలోనే అశేష భక్తజనులు గోవిందనామస్మరణల నడుమ మహారథం లాగుతూ తన్మయత్వం చెందారు. రాత్రి అశ్వవాహనంపై మలయప్పస్వామివారు కల్కి అవతారంలో విహరించారు. కార్యక్రమంలో పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్, జేఈఓ వీరబ్రహ్మం పాల్గొన్నారు.

చక్రస్నానానికి పకడ్బందీ ఏర్పాట్లు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం చక్రస్నానం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా వేకువజామున 3 గంటల నుంచి పల్లకి ఉత్సవం, తిరుచ్చి ఉత్సవం జరిపించనున్నారు. అనంతరం వరాహస్వామి ఆలయంలో దేవదేవేరులు, చక్రతాళ్వార్‌కు స్నపన తిరుమంజనం చేపట్టనున్నారు. .అనంతరం పవిత్ర పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించనున్నారు. ఈ క్రమంలోనే రాత్రి 9 నుంచి 10 గంటల నడుమ ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు పరిపూర్ణం చేయనున్నారు. చక్రస్నానం సందర్భంగా టీటీడీ ఈఓ అనిల్ కుమార్ సింఘాల్, ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్ఓ మురళీకృష్ణ, జేఈఓ వీరబ్రహ్మం పుష్కరిణి వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ పుష్కరిణిలో 9,400 మంది పుణ్యస్నానమాచరించేలా పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.

అమ్మో.. మృగాళ్లు



- గ్యాంగ్‌రేప్ నిందితులకు బిగుస్తున్న ఉచ్చు
- కీలకమైన ఆధారాలు సేకరించిన పోలీసులు
- ఘటనా స్థలంలో ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ బృందాలతో జల్లెడ
- ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- ఆ మృగాళ్ల ఫోన్లలో వీడియోల తనిఖీ.. ఎఫ్ఎస్ఎల్‌కు తరలింపు



చిత్తూరు అర్బన్ : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన చిత్తూరు నగరంలో బాలికపై సామూహిక లైంగిక దాడి కేసులో నిందితులు చేసిన పాపానికి ఉచ్చు బిగుస్తోంది. నేరం చేస్తే ఎవరూ నోరు విప్పరనే ధైర్యంతో ఉన్న ఆ ముగ్గురూ.. చేసిన నేరాన్ని సాక్ష్యాలతో సహా న్యాయస్థానం ఎదుట నిరూపించడానికి ఆధారాలు సేకరిస్తున్నారు. బుధవారం చిత్తూరు డీఎస్పీ సాయినాథ్‌తో పాటు, తాలూక ఎస్ఐ మల్లికార్జున, ఫింగర్‌ప్రింట్ ఇన్‌స్పెక్టర్ సతీష్, తిరుపతిలోని ఫోరెన్సిక్ సైంటిఫిక్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్) కేంద్రానికి చెందిన మహిళా అధికారి గ్యాంగ్‌రేప్ జరిగిన ఘటనా స్థలంలో పలు సాక్ష్యాలను సేకరించారు. దాదాపు రెండు గంటల పాటు పోలీసులు ఘటనా స్థలాన్ని జల్లెడ పట్టి, కీలకమైన ఆధారాలను సేకరించినట్లు విశ్వసనీయంగా తెలిసింది.

సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడం

నిందితులను పట్టుకునేప్పుడు స్థానికులపై తిరగబడటానికి ప్రయత్నిస్తే దేహశుద్ధి చేశారు. ఆపై నిందితులు తీసిన వీడియోలు బుధవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. నిందితులు కిషోర్, మహేష్, హేమంత్ అఘాయిత్యం జరిగిన తీరును వివరిస్తున్నట్లుగా ఆ వీడియోల్లో తెలుస్తోంది. వీళ్లను పోలీసులకు అప్పగించే క్రమంలో నిందితులు ముగ్గురూ పారిపోగా.. తాజాగా నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇక నిందితుల మొబైల్ ఫోన్లలో వీడియోల విషయం తేల్చడానికి వాటిని ఎఫ్ఎస్ఎల్‌కు పంపనున్నారు. నిందితులను గురువారం అరెస్టు చూపించే అవకాశం ఉంది.

పార్కులో అటవీశాఖ భద్రత డొల్ల

ఈ ఘటనలో చిత్తూరు పశ్చిమ రేంజ్ అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. పార్కులో ఎంట్రీ కోసం రూ.10 డిజిటల్ చెల్లింపుల ద్వారా వసూలు చేస్తున్న అధికారులు, ఇక్కడ సందర్శకుల భద్రత కోసం ఏ ఒక్క చర్య పాటించడం లేదు. దాదాపు 6 కి.మీ విస్తీర్ణం ఉన్న నగర వనంలో ఒక్కటంటే ఒక్క సీసీ కెమెరా కూడా లేకపోవడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. పైగా పార్కులో దట్టమైన రిజర్వు ఫారెస్టు (ఆర్ఎఫ్) కలిసి ఉంది. ఈ రెండింటినీ వేరుచేసే కంచె కూడా లేదు. దీని వల్ల వన్య మృగాలు సందర్శకులపై దాడి చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. సందర్శకులు సైతం పార్కును దాటుకుని ఆర్ఎఫ్‌లోకి వెళితే, వాళ్లు బయటకు వచ్చారా..? లేదా కూడా తెలియదు. ఇక వాచర్లు, బీట్ అధికారులు పూర్తి సమయం ఇక్కడ ఉండటం లేదు. సందర్శకులకు కనీస భద్రత లేకుండా ఆఘమేఘాలపై నగరవనాన్ని అందుబాటులోకి తీసుకురావడం అధికారుల అత్యుత్సాహమే అవుతుంది. దీనిపై వెస్ట్ రేంజ్ ఎఫ్ఆర్వో పట్టాభి వివరణ ఇస్తూ.. ఆర్ఎఫ్ చుట్టూ కంచె ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని, హెచ్చరిక బోర్డులు పెట్టామని, వాచర్లను కూడా పెట్టామంటూ చేతుల కాలాక ఆకులు పట్టుకున్నట్లు చెప్పుకొచ్చారు.

మాటువేసి..కాటువేసి

గత నెల 25వ తేదీన బాలిక, ఆమె స్నేహితుడు కలిసి చిత్తూరు–తిరుపతి రోడ్డులో ఉన్న అటవీశాఖకు చెందిన నీవా నగరవనికి వెళ్లడం.. అక్కడ కిషోర్, మహేష్, హేమంత్ ముగ్గురూ బాలికపై అఘాయిత్యానికి పాల్పడటం అయిదు రోజుల తరువాత వెలుగులోకి వచ్చింది. అయితే నిందితులు ముగ్గురికీ నీవా నగరవనంపై పూర్తి పట్టు ఉన్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. బాలిక, ఆమె స్నేహితుడు లోపలికి వెళ్లగానే వాళ్లను వెనక నుంచి నిందితులు ముగ్గురూ వెంబడించారు. ఓ చోట ఇద్దరు స్నేహితులు మాట్లాడుకుంటుండగా అప్పటికే మాటు వేసిన నిందితులు చుట్టూ ఎవరూ లేరని నిర్ధారించుకున్నారు. తొలుత తమను అటవీశాఖ సిబ్బందిగా చెప్పుకున్న నిందితులు, బాధితులు ఇద్దరినీ ఓ గుట్టపై ఉన్న నిర్మానుష ప్రాంతానికి తీసుకెళ్లారు. అప్పటికే తమ వద్ద ఉన్న కత్తులు చూపించి బాలికపై ఒకరి తరువాత ఒకరు అఘాయిత్యానికి ఒడిగట్టారు. ఈ సమయంలో బాలికతో వచ్చిన యువకుడు ప్రతిఘటించడానికి ప్రయత్నిస్తే అతడిపై విచక్షణారహితంగా దాడి చేసి, నోరుమూసి పెట్టి చంపడానికి ప్రయత్నించారు. చివరగా వెళ్లేప్పుడు యువకుడి బంగారు చైనును లాక్కెళ్లారు. ఈ మొత్తం ఘటనలో కొన్ని నిముషాల వీడియో నిందితుల మొబైల్ ఫోన్లలో చిత్రీకరించినట్లు తెలుస్తోంది. రెండు రోజుల తరువాత గాయపడ్డ యువకుడు జరిగిన విషయం తన కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఆపై వారు నిందితుల కోసం గాలించి, గత నెల 29వ తేదీన వాళ్లను పట్టుకుని దేహశుద్ధి చేశారు.



గ్యాంగ్‌రేప్‌కు పాల్పడ్డ నిందితులు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ సాయినాథ్, ఫోరెన్సిక్, ఫింగర్ ప్రింట్ బృందాలు

అభ్యుదయ రైతుకు అభినందన



కిసాన్ డ్రోన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

పెనుమూరు(కార్వేటినగరం) : ప్రముఖ కవి, అభ్యుదయ రైతు హరికృష్ణారెడ్డిని కలెక్టర్ సుమిత్‌కుమార్ అభినందించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో జీఎస్టీ తగ్గింపుపై జరిగిన అవగాహన కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ యంత్రాలు, పరికరాల ప్రదర్శన జరిగింది. హరికృష్ణారెడ్డి పులిగుంటేశ్వర ప్రకృతి రైతు ఉత్పత్తిదారుల సంఘం స్థాపించి రైతులకు పవర్ స్ప్రేయర్లు, డ్రోన్లు అందుబాటులోకి తెచ్చారు. ఈ సందర్భంగా అభ్యుదయ రైతు హరికృష్ణారెడ్డి కొనుగోలు చేసిన కిసాన్ డ్రోన్‌ను ప్రారంభించి రైతును కలెక్టర్ అభినందించారు. వారితో పాటు పూతలపట్టు ఎమ్మెల్యే, చిత్తూరు ఎమ్మెల్యే కూడా అభినందించారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో బుధవారం భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 14 కంపార్ట్‌మెంట్లు నిండాయి. మంగళవారం అర్ధరాత్రి వరకు 73,275 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 21,973 మంది తలనీలాలు అర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.77 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకోవడానికి 15 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

కమిషనర్ తీరుపై ఆగ్రహం

- కలెక్టర్‌కు వినతిపత్రం అందించిన చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న మున్సిపల్ కౌన్సిల్

పుత్తూరు : పుత్తూరు మున్సిపల్ కమిషనర్ వ్యవహార తీరుపై మున్సిపల్ కౌన్సిల్‌లో ఎగసిన ఆగ్రహ జ్వాల కలెక్టర్ వద్దకు చేరింది. బుధవారం పుత్తూరు మున్సిపాలిటీలోని సమస్యలు, వాటికి మున్సిపల్ కౌన్సిల్ చేసే తీర్మానాలు, అమలు కాకపోవడాన్ని పూర్తి వివరాలతో మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి, వైస్‌చైర్మన్లు జయప్రకాష్, శంకర్, కౌన్సిలర్లు వినతిపత్రం రూపంలో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు అందించారు. కౌన్సిల్‌లో ఎదురయ్యే సమస్యలను కలెక్టర్‌కు వివరిస్తూ మున్సిపాలిటీ కమిషనర్‌గా మంజునాథ్ గౌడ్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటికి వరకు 7 సమావేశాలు జరిగాయని ఆ సమావేశాల్లో చేసిన తీర్మానాలు ఒక్కటి కూడా అమలుకు నోచుకోలేదన్నారు. కమిషనర్ దృష్టికి తీసుకొచ్చినా ఏ మాత్రం స్పందన లేదన్నారు. అధికారిగా ఆయన వ్యవహరించడం లేదని పచ్చచొక్కా తొడుక్కున్న నేతలా వ్యవహరిస్తున్నారన్నారు. వర్షాకాల పరిస్థితిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా తీసుకోవడం లేదన్నారు. పార్టీ మారిన ఇద్దరు కౌన్సిలర్లపై విప్ యాక్షన్ తీసుకొని అనర్హులుగా ప్రకటించమన్నా స్పందించడం లేదన్నారు. 4వ వార్డు కౌన్సిలర్ కేశవా ఆచారి ఎన్నిక చెల్లదని కోర్టు తీర్పు ఇచ్చి 6 నెలలైనా గౌరవ వేతనం ఇస్తూ సమావేశానికి అనుమతిస్తున్నారన్నారు. మున్సిపల్ పార్కు, క్రిమేషన్ షెడ్డు, షాదిమహల్ ఇలా గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులన్నింటినీ నిర్వీర్యం చేస్తున్నారన్నారు. 90 శాతం పూర్తయిన మున్సిపల్ భవనాన్ని వినియోగంలోకి తేవడం లేదన్నారు. ఆక్రమణల తొలగింపుపై చర్యలు తీసుకోలేదన్నారు. మున్సిపల్ చట్టం ప్రకారం మున్సిపల్ కౌన్సిల్‌కు ఉన్న హక్కులు ఏమయ్యాయని ప్రశ్నించారు. అధికారులే హక్కులు కాలరాస్తుంటే ప్రజాస్వామ్యం ఎక్కడ ఉంటుందన్నారు. అలాంటి కమిషనర్ మా కొద్దంటూ మున్సిపల్ కౌన్సిల్ వేదికగా ఏకగ్రీవంగా సరెండర్ చేయాలని ఆమోదించినా మినిట్స్ పుస్తకంలో నమోదు చేయలేదన్నారు. సమస్య తీవ్రతను అవగాహన చేసుకొని కమిషనర్‌ను సరెండర్ చేయాలని, కౌన్సిల్‌కు న్యాయం చేయాలని కోరారు. అలాగే పుత్తూరు ఈశలాపురం సర్వే నంబరు 6లో గ్రానైట్ క్వారీ ఉందని ఆ క్వారీలో పరిమితికి మించి పేలుళ్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కారణంగా జనజీవనానికి ఇబ్బందులు కలుగుతున్నాయని, పక్కనే ఉన్న మామిడి తోటలు, ఇతర పంటలపై దుమ్ము చేరి పంటలు సరిగా పండటం లేదన్నారు. ఇటీవల ఒక బాలుడి తలపై రాయి పడి తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడన్నారు. రైతుల బోర్లు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి తీవ్రతను అర్థం చేసుకొని క్వారీని నిలుపుదల చేయాలని కోరారు.

మహిషాసురమర్దినిగా బోయకొండ గంగమ్మ



చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారిని బుధవారం శత్రు సంహారి మహిషాసురమర్దిని అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఉగ్రరూపం దాల్చుతూ సింహంపై నిలువరించి ఒక చేతిలో ఖడ్గం, మరో చేతిలో త్రిశూలం, గదను ఎత్తుకొని శత్రువుని సంహరిస్తూ ఉన్నవిధంగా అర్చకులు అలంకరించారు. అమ్మవారిని బంగారు ఆభరణాలతో ముస్తాబుచేశారు. ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో వేద పండితులు గోవర్ధనశర్మ అర్చక బృందం అభిషేకాలు, అర్చనలు, గణపతి హోమం, చండీహోమంతో పాటు పూర్ణాహుతి చేశారు.



బోయకొండ గంగమ్మ ఆలయంలో హోమ పూజలు చేస్తున్న అర్చకులు

క్లుప్తంగా

కేజీబీవీల్లో సీసీ కెమెరాల నిఘా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఉన్న కేజీబీవీల్లో బాలికల భద్రత నిమిత్తం సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా సమగ్రశిక్షాశాఖ ఏపీసీ వెంకటరమణ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని 8 కేజీబీవీలకు సీసీ కెమెరాలను మంజూరు చేసిందన్నారు. జిల్లాలోని కేజీబీవీలలో రాష్ట్రం నుంచి విచ్చేసే ప్రత్యేక బృందం సీసీ కెమెరాలను అమర్చుతారన్నారు. జిల్లాలోని 8 కేజీబీవీలలో అవసరమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసే పనిలో ఇంజినీరింగ్ అధికారులు నిమగ్నమయ్యారన్నారు. జిల్లాలో డీఎస్సీ శిక్షణ నిర్వహించే కేంద్రాల్లో ఏర్పాట్లు పకడ్బందీగా చేస్తున్నామని ఏపీసీ వెల్లడించారు.

విద్యుదాఘాతానికి యువకుడు బలి


మృతి చెందిన అస్గర్ అలీ

కుప్పంరూరల్ : విద్యుదాఘాతానికి గురై యువకుడు దుర్మరణం పాలైన సంఘటన కుప్పం విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో జరిగింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా.. కుప్పం సబ్ స్టేషన్ ఆవరణలో గెస్ట్ హౌస్‌పై మరో అంతస్తు నిర్మాణం చేపడుతున్నారు. నిర్మాణాలు పూర్తి కావడంతో పై కప్పునకు పీవోపీ వేసేందుకు గురువారం బీహార్‌కు చెందిన యువకుడు అస్గర్ అలీ (34) వచ్చాడు. పనులు చేసుకుని బయటికి వచ్చే సందర్భంగా తన వెంట తెచ్చుకున్న ఇనుప కమ్మీని ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తాకించాడు. ప్రమాదంలో అస్గర్ అలీ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అక్కడే ఉన్న మేస్త్రీ.. విద్యుత్, పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువకుడు అస్గర్ అలీ బీహార్ రాష్ట్రం నుంచి వచ్చి స్థానికంగా ఓ పీవోపీ దుకాణంలో పనులు చేస్తున్నాడు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

చౌడేపల్లె : బోయకొండ భవానీ నగర్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. బోయకొండకు చెందిన జయరామిరెడ్డి కుమారుడు సునీల్‌కుమార్(25) బైక్‌లో భవానీ నగర్‌లోని ఆర్చి నుంచి బోయకొండ గంగాపురం వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొన్నాడు. స్థానికులు అతడిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సౌత్ జోన్ కబడ్డీ పోటీలకు స్విమ్స్ జట్టు


క్రీడాకారులతో స్విమ్స్ వీసీ, అధికారులు

తిరుపతి తుడా: కర్ణాటకలోని రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో ఈనెల 4 నుంచి 7వ తేదీవరకు నిర్వహించనున్న సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీలకు స్విమ్స్ జట్టును బుధవారం ఎంపిక చేశారు. ఎస్.మనోజ్ కుమార్ ఎం.సునీల్ కుమార్, నాగార్జున, శివరంగా, నవీన్ సింగ్, వెంకట గణేష్, ఉదయ్ కుమార్, మల్లికార్జున, భరత్ కుమార్ (స్విమ్స్ నర్సింగ్ కాలేజీ), శ్రవణ్ కుమార్, లోకేష్, అమీర్, వెంకటేష్, తేజేశ్వర్ (హెల్త్ సైన్సెస్)కు జట్టులో స్థానం కల్పించారు. పోటీలలో తమ జట్టు విజయం సాధించాలని స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్.బిట్లా, స్పోర్ట్స్ బోర్డ్ చైర్మన్ కేఆర్ శుభాష్, సభ్యులు పి.విశ్వనాథ్‌రెడ్డి, పీడీ బీపీ మధుబాబు కోరారు.

అవస్థల పింఛన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పింఛన్లు పొందేందుకు పండుటాకులు అవస్థలు పడుతున్నారు. ప్రతి నెలా ఏదో ఒక సమస్యతో వృద్ధులకు సకాలంలో పింఛన్లు అందని దుస్థితి. తాజాగా సచివాలయ ఉద్యోగులు వాలంటీర్ విధులు తాము చేయలేమంటూ నిరసన చేపట్టారు. దీంతో ఈనెల 1వ తేదీన జిల్లా వ్యాప్తంగా వేకువజామునే వృద్ధులకు అందాల్సిన సామాజిక పింఛన్లు ఉదయం 11 గంటల వరకు మొదలవ్వని పరిస్థితి. కూటమి ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులను చిన్నచూపు చూస్తోందని ఇంటింటికీ వెళ్లి పింఛన్లు తాము అందజేయలేమని నిరసనకు దిగారు. దీంతో జిల్లా వ్యాప్తంగా అక్టోబర్ నెల పింఛన్ల పంపిణీ ప్రక్రియ కోతలతో పాటు అవస్థల నడుమ కొనసాగింది.

- పండుటాకులకు ఉదయాన్నే అందని పింఛన్ సొమ్ము
- ఉదయం 11 గంటల వరకు ప్రారంభం కాని పంపిణీ
- వాలంటీర్ విధులు చేయలేమంటూ సచివాలయ ఉద్యోగుల నిరసన
- సచివాలయాల వద్ద క్యూ కట్టిన వృద్ధులు
- పింఛన్ సొమ్ము కోసం గంటల తరబడి నిరీక్షణ



మంగసముద్రం ప్రాథమిక పాఠశాల వద్ద గుంపులుగా నిలబడి పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులు, (ఇన్‌సెట్) చిత్తూరు : 30వ వార్డు సచివాలయం మెట్లు ఎక్కలేక అవస్థలు పడుతున్న వృద్ధురాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా రూరల్‌లో 504, అర్బన్‌లో 108 మొత్తం 612 గ్రామ, వార్డు సచివాలయాలున్నాయి. సచివాలయాల పరిధిలోని పింఛన్ లబ్ధిదారులకు గత ఐదేళ్లలో ప్రతి నెలా ఒకటవ తేదీన వేకువజామునే పింఛన్లు అందజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వాలంటీర్లను కొనసాగిస్తామని హామీ ఇచ్చి తుంగలో తొక్కారు. దీంతో కూటమి ప్రభుత్వ పాలనలో పేదలకు సేవలందించే వాలంటీర్లు కనుమరుగయ్యారు. వాలంటీర్ వ్యవస్థకు కూటమి ప్రభుత్వం మంగళం పాడటంతో వారి విధులు సచివాలయ ఉద్యోగులతో చేయించడం మొదలుపెట్టారు. గత ఒకటిన్నర సంవత్సరంగా సచివాలయ ఉద్యోగులు అదనపు విధులు నిర్వహిస్తూనే వచ్చారు. ఓపికతో ఎంత ఒత్తిడి ఉన్నా అదనపు బాధ్యతలను చేస్తున్న సచివాలయ ఉద్యోగులను కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చేయడం మొదలుపెట్టింది. దీంతో అధిక ఒత్తిడికి తట్టుకోలేని సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వంపై తిరుగుబాటుకు సిద్ధమయ్యారు.

మెరుపు నిరసన

సచివాలయ ఉద్యోగుల డిమాండ్లు, సమస్యలను పరిష్కరించకపోవడంతో ఆందోళనలు చేయడం మొదలుపెట్టారు. తాము వాలంటీర్లు కాదని, కష్టపడి ఉన్నత విద్య చదివి పోటీ పరీక్షలు రాసి సచివాలయ ఉద్యోగాలు సాధించామని తిరుగుబాటుకు సిద్ధమయ్యారు. వాలంటీర్ల విధులు తాము చేయమంటూ అక్టోబర్ 1న జిల్లా వ్యాప్తంగా సకాలంలో పింఛన్ల పంపిణీ చేయకుండా నిరసన చేపట్టారు.

గందరగోళంగా పంపిణీ

జిల్లా వ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈనెల 1వ తేదీన పింఛన్ల పంపిణీ గందరగోళంగా కొనసాగింది. సచివాలయ ఉద్యోగుల తిరుగుబాటు వల్ల వేకువజామున పంపిణీ కావాల్సిన పింఛన్ల పంపిణీ ఉదయం 11 గంటల వరకు ప్రారంభం కాని దుస్థితి. వేకువజామునే పింఛన్ సొమ్ము కోసం నిరీక్షించే వృద్ధులు సచివాలయాల వద్దకు పరుగులు తీశారు. ఇంటింటి పింఛన్ల పంపిణీ జరగకపోవడంతో వృద్ధులు అధిక సంఖ్యలో సచివాలయాల వద్ద క్యూ కట్టారు. నిలబడేందుకు ఒంట్లో సత్తువ లేకున్నా గంటల తరబడి నిలబడి పింఛన్ సొమ్మును తీసుకున్నారు. అసలే నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు చిత్తూరు నగరంలోని 28, 30 వార్డుల సచివాలయాల మెట్లు ఎక్కి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరికొన్ని సచివాలయాల వద్ద ఉదయం 10 గంటలు అవుతున్నా సచివాలయ ఉద్యోగులు రాకపోయే సరికి పింఛన్ల కోసం పడిగాపులు కాశారు.

జిల్లా సమాచారం	
గ్రామ సచివాలయాలు	504
వార్డు సచివాలయాలు	108
రూరల్‌లోని కుటుంబాలు	1,65,970
అర్బన్‌లోని కుటుంబాలు	1,01,121
గత నెల సెప్టెంబర్‌లో అందజేసిన పింఛన్లు	2,69,812
ప్రస్తుత నెల అక్టోబర్‌లో అందజేసిన పింఛన్లు	2,68,307
తొలగించిన పింఛన్లు	15,495

1,505 పింఛన్ల తొలగింపు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలకు పైగా అవుతోంది. ఇప్పటి వరకు ఒక్క కొత్త పింఛన్ మంజూరు చేయలేదు. కొత్త పింఛన్ల కోసం ప్రతి సోమవారం వృద్ధులు పీజీఆర్ఎస్‌లో అర్జీలు ఇస్తూనే ఉన్నారు. ఆ అర్జీలను అధికారులు స్వీకరించి బుట్టదాఖలు చేస్తున్నారే తప్ప కొత్త పింఛన్లు ఇవ్వని పరిస్థితి. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా ప్రతి నెలా ఏదో ఒక కారణంతో కూటమి ప్రభుత్వం ఉన్న పింఛన్లలో కోత విధిస్తోంది. తాజాగా అక్టోబర్ నెల పింఛన్లలో 1,505 పింఛన్లు తొలగించారు. గత నెల సెప్టెంబర్‌లో జిల్లా వ్యాప్తంగా 2,69,812 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. అయితే ప్రస్తుతం అక్టోబర్ నెలలో 2,68,307 మందికి పింఛన్ల నగదు మంజూరు అయినట్లు తెలిపారు. కాగా మంజూరు అయిన వారిలో 2,68,307 మందికి గాను 2,52,812 మందికి బుధవారం సాయంత్రం వరకు పింఛన్లు పంపిణీ చేశారు. మిగిలిన 15,495 మందికి సరఫరా చేయలేక విఫలమయ్యారు. ప్రతి నెలా ఏదో ఒకసాకుతో పింఛన్ల కోత విధిస్తున్న ప్రభుత్వంపై పింఛన్ లబ్ధిదారులు నిట్టూరుస్తున్నారు.


నడవలేని స్థితిలో ఉన్న తల్లిని సచివాలయం వద్దకు తీసుకొచ్చి పింఛన్ తీసుకెళ్తున్న దృశ్యం


చిత్తూరు : 28వ వార్డు సచివాలయంలో పింఛన్లు అందజేస్తున్న ఉద్యోగులు


28వ డివిజన్ సచివాలయం వద్ద రోడ్డులో నిలబడి పింఛన్లు అందజేస్తున్న దృశ్యం

బాలికలు, మహిళలకు రక్షణ కల్పించాలి

- సమావేశంలో ఐద్వా జిల్లా నాయకురాలు చిట్టెమ్మ డిమాండ్


మాట్లాడుతున్న చిట్టెమ్మ

చిత్తూరు కార్పొరేషన్ : బాలికలు, మహిళలకు రక్షణ కల్పించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా నాయకురాలు చిట్టెమ్మ డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం నాయకులు వారి కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. చిత్తూరు నగరంలో బాలికలు, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. పలు ఘటనలతో మహిళలు, బాలికలు భయాందోళనకు లోనవుతున్నారని తెలిపారు. రోజురోజుకు బాలికలు, మహిళలపైన అఘాయిత్యాలు జరగడం దారుణమన్నారు. అఘాయిత్యాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా ఎవరు తప్పు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కూటమి పాలకులు రోజూ మహిళలకు అన్ని రకాల పథకాలు అందిస్తున్నామని గొప్పగా ప్రచారం చేస్తున్నారే తప్ప ఆచరణలో అవేమి జరగడం లేదన్నారు. జిల్లా కేంద్రంలో అన్ని రకాల అధికారులు సౌకర్యాలు ఉన్నా ఇక్కడే పలు ఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. పోలీసులు చిత్తశుద్ధితో వ్యవహరించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జనసేన జెండాను పీకి పడేసిన టీడీపీ నేత

- జనసేన, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదం

పాలసముద్రం : మండలంలోని వనదుర్గాపురం పంచాయతీలో ఆవిష్కరించిన జనసేన జెండాను టీడీపీ చోటా నాయకుడు నవీన్ చౌదరి బుధవారం జనసేన జెండాను పీకి ముళ్లపొదల్లో పడేశాడు. వనదుర్గాపురంలో ప్రాథమిక పాఠశాల ఎదుట దిమ్మెలు కట్టి జనసేన, టీడీపీ జెండాలు ఆవిష్కరించారు. కొన్ని రోజులు తరువాత టీడీపీ జెండా లేకుండా పోయింది. అయితే జనసేన పార్టీ జెండా మాత్రమే ఉంది. దీన్ని గమనించిన టీడీపీ నాయకుడు జెండా ఎగుర వేయడానికి ఉంచిన పైపును పడగొట్టి పై నున్న జెండాను చుట్టి ముళ్లపొదల్లో విసిరేశాడు. రోడ్డు పనులు ప్రారంభోత్సవానికి వచ్చిన జనసేన పార్టీ యువకులు ముళ్లపొదల్లో ఉన్న పైప్ జెండాను చూశారు. దీంతో టీడీపీ, జనసేన నాయకుల మధ్య వాగ్వాదం ముదిరి తీవ్ర స్థాయికి చేరింది.



ముళ్లపొదల్లో పడేసిన జనసేన జెండా, విరిచేసిన జెండా పైప్

ఉబికిన గంగ.. తీరిన బెంగ



రొంపిచెర్ల : ఎండిపోయిన వ్యవసాయ బోరు నుంచి నీరు ఉబికివస్తున్న సంఘటన రొంపిచెర్ల మండలం బండకింద పల్లె పంచాయతీలో చోటు చేసుకుంది. మటోళ్లపల్లెకు చెందిన రైతు సదాశివరెడ్డి వ్యవసాయ పొలంలో 20 ఏళ్ల క్రితం బోరు వేశారు. కొన్నేళ్ల తర్వాత ఆ బోరులో నీరు రాక పోవడంతో అలాగే వదిలేశారు. 10 రోజులుగా కురుస్తున్న వర్షాలకు భూగర్భ జలాలు పెరిగి రైతు సదాశివరెడ్డి పొలంలో వేసిన బోరు నుంచి నీరు ఉబికి వస్తోంది. ఈ బోరు జాతీయ రహదారి పక్కనే ఉండడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

స్విమ్స్‌లో మెడికల్ మాఫియా!

- పద్మావతి ఆస్పత్రి మందులషాపు కేటాయింపులో కిరికిరి
- టీటీడీకి రూ.57లక్షలు ఎగ్గొట్టిన వ్యక్తికి కట్టబెట్టేందుకు ఎత్తులు
- ఒత్తిడికి తలొగ్గి డిఫాల్టర్‌కు అనుకూలంగా టీటీడీ చైర్మన్ ఆదేశాలు?



సాక్షి టాస్క్ ఫోర్స్: టీటీడీ పరిధిలోని స్విమ్స్ ఆస్పత్రిలో మెడికల్ మాఫియా రాజ్యమేలుతోంది. ఇప్పటికే ఇక్కడి మందుల షాపులో నాణ్యమైన మందులు లేవని, జనరిక్ స్థానంలో ఖరీదైన మందులను రోగులకు అంటగడుతున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. వీటి ఆధారంగానే ఇటీవల సదరు మందుల దుకాణం నిర్వహిస్తున్న ఇన్నొవేటివ్‌వీ ఫార్మాస్యూటికల్ కంపెనీకి టీటీడీ నోటీసులు కూడా జారీ చేసింది. అయినప్పటికీ కంపెనీ యజమాని తన రాజకీయ పలుకుబడితో నోటీసులను లెక్కచేయలేదు. టెండర్ రూల్స్‌కు విరుద్ధంగా మందులు విక్రయిస్తున్నా అడిగేవారు కరువయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడి అండదండలతో కంపెనీ యజమాని రెచ్చిపోతున్నాడు. సిమ్స్ ఓపీ , డాక్టర్స్ క్యాంటీన్ పక్కన గతంలో ఉన్న జనరిక్ మందుల షాపులు రోగులకు సౌకర్యంగా ఉండేవి. అత్యవసర విభాగం సమీపంలో ఎన్టీఆర్ విగ్రహానికి కుడి పక్కన ఉన్న ఇన్నొవేటివ్‌వీ ఫార్మా కంపెనీకి చెందిన మెడికల్ షాప్ మేలు కోసం ఆ రెండు జెనరిక్ షాపులను తొలగించారు. ఈ మందుల దుకాణం నిర్వహణ తీరు స్విమ్స్ అధికారులకు సైతం తలనొప్పిగా మారింది. ఇది చాలదన్నట్టు పద్మావతి ఆస్పత్రి సమీపంలోని మరో మెడికల్ షాపును సైతం ఇన్నొవేటివ్‌వీ ఫార్మా యజమాని దక్కించుకునేందుకు ఎత్తులు వేస్తున్నారు. రాజకీయ నేతలను రంగంలోకి దింపి టీటీడీ చైర్మన్‌ను సైతం మెప్పించి, ఒప్పించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే సదరు మెడికల్ ఏజెన్సీకి టెండర్ ఫైనల్ చేయాలని టీటీడీకి అనధికారిక ఆదేశాలు అందినట్లు సమాచారం.

ఆ కంపెనీపై ఎందుకు అంత ప్రేమ

టీటీడీని నకిలీ డాక్యుమెంట్లతో (బ్యాంకు గ్యారంటీతో) మోసం చేయడంతోపాటు అద్దెను సకాలంలో చెల్లించకుండా డిఫాల్టర్ గా ఇన్నొవేటివ్‌వీ ఫార్మాస్యూటికల్ కంపెనీ ముద్ర వేసుకుంది. ఇవన్నీ పక్కనపెట్టి సదరు కంపెనీకే పద్మావతి మెడికల్ షాప్‌ను కట్టబెట్టాలని జనసేన పార్టీ నేతలు రంగంలోకి దిగారు. డిఫాల్ట్‌గా ఉన్న సంస్థను పక్కనపెట్టి టెండర్ ఓపెన్ చేసిన ఒకటి రెండు రోజుల్లోనే తర్వాత ఎక్కువ కోట్ చేసిన ఫార్మా కంపెనీకి మెడికల్ షాపును అప్పగించాల్సి ఉంది. అయితే టీటీడీ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా నెలకు పైగా ఓపెన్ చేసిన టెండర్‌ను ఖరారు చేయకుండా కాలయాపన చేయడం వెనక దాగిన కుట్రను తేటతెల్లం చేస్తోంది. ఈ మెడికల్ షాపు కేటాయింపు వెనుక భారీ మొత్తం చేతులు మారినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

డిఫాల్టర్‌గా ముద్ర

స్విమ్స్ అత్యవసర విభాగం సమీపంలోని మెడికల్ షాపును ఈ ఏడాది జనవరి నుంచి ఇన్నొవేటివ్‌వీ ఫార్మాస్యూటికల్ కంపెనీ చేజిక్కించుకుని పలు ఆరోపణల నడుమ నడుపుతోంది. స్విమ్స్ పరిధిలో కొంత కాలం వరకు మరో మెడికల్ షాపు లేకుండా చక్రం తిప్పి పుష్కలంగా ఆదాయం పొందుతోంది. ఈ క్రమంలోనే రాజకీయ నేతలకు అడిగింది ఇచ్చుకుని పద్మావతి ఆస్పత్రిలోని పద్మావతి మెడికల్ షాపును కూడా దక్కించుకునేందుకు సన్నద్ధమవుతోంది. ఈ మందుల దుకాణానికి రెండు నెలల క్రితం టీటీడీ టెండర్ పిలిచింది. నిబంధనల ప్రకారం అర్హత ఉన్నవాళ్లు కేవలం ముగ్గురు మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఆగస్టు 25వ తేదీన టెండర్ ఓపెన్ చేశారు. సదరు ఫార్మా కంపెనీ అత్యధిక కోడ్ తో మొదటి వరుసలో నిలిచి టెక్నికల్‌గా అర్హతను కోల్పోయింది. టీటీడీలో ఇప్పటివరకు నిధులను ఎగ్గొట్టిన వారు టెండర్ తగ్గించుకునేందుకు అనర్హులు. ఇప్పటికే నడుపుతున్న మెడికల్ షాపునకు సంబంధించి టీటీడీకి రూ. 57 లక్షలకు పైగా సకాలంలో చెల్లించకుండా ఇన్నొవేటివ్‌వీ ఫార్మాస్యూటికల్ కంపెనీ ఎగ్గొట్టింది. అలాగే టీటీడీకి ఇవ్వాల్సిన రూ.5కోట్ల బ్యాంకు గ్యారంటీని పాత మెడికల్ షాపునకు సంబంధించిన గ్యారెంటీనే కొత్త అటెండర్‌లోనూ చూపించింది. టెండర్ ఓపెన్ చేయక ముందే మోసం చేసిన కంపెనీని పక్కన పెట్టాల్సిన టీటీడీ అధికారులు ఆ దిశగా నిర్ణయం తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. పై రెండు అంశాల తో ఆ సంస్థ డిఫాల్టర్‌గా ముద్రపడింది. రాజకీయ నేతల ఒత్తిడికి తలొగ్గిన టీటీడీ అధికారులు అనర్హత కలిగిన కంపెనీకే మెడికల్ షాపును అప్పగించేందుకు పావులు కదపడం చర్చనీయాంశంగా మారింది. దీనికి తోడు టీటీడీ చైర్మన్ సైతం డిఫాల్ట్ కంపెనీకే కేటాయించేలా అధికారులకు సూచనలు చేయడం వివాదానికి మరింత ఆజ్యం పోస్తోంది. సదరు కంపెనీ ఎక్కువ కోట్ చేసిందనే సాకును చూపి, డిఫాల్టర్ అనే విషయాన్ని పక్కన పెట్టడంపై కొందరు కోర్టును ఆశ్రయించనున్నట్లు తెలిసింది.

పెళ్లిపత్రికలు ఇచ్చి వస్తుండగా ప్రమాదం


ప్రమాదానికి గురైన కారు, లారీ

యాదమరి : పెళ్లిపత్రికలు ఇచ్చి వస్తుండగా ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న లారీని ఢీకొని కారులోని ముగ్గురు గాయపడిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి మండలంలో చోటు చేసుకుంది. వివరాలు..పూతలపట్టు మండలం బండపల్లి గ్రామానికి చెందిన నరేష్, భీమేశ్వరన్, వినోద్ కలిసి కారులో తమిళనాడు రాష్ట్రం గుడియాత్తంకు వెళ్లి వస్తున్నారు. మార్గమధ్యలో మండల పరిధి సంతగేటు సమీపంలోకి రాగానే అదుపు తప్పి గుడియాత్తం వైపుగా వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు స్వల్పంగా గాయపడ్డారు. అర్ధరాత్రి భారీ శబ్దం రావడంతో భయాందోళన చెందిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలికి చేరుకుని గాయపడ్డ క్షతగాత్రులను 108 వాహనం ద్వారా చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నామని స్థానిక ఎస్‌ఐ ఈశ్వర్ తెలిపారు.

కారు బోల్తా పడి ఒకరి మృతి


మురళి (ఫైల్)

తిరుపతి రూరల్ : మండలంలోని చిగురువాడ వద్ద స్వర్ణముఖినదిలో కారు బోల్తా పడిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం, కిచ్చమనాయుడుపల్లెకు చెందిన కంకలపాటి మురళి (42) తిరుపతిలో నివసిస్తున్నాడు. అయితే వ్యాపారం రీత్యా కార్వేటినగరంలో ప్రొవిజన్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. నిత్యం తిరుపతి నుంచి కార్వేటినగరానికి వెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి కారులో తిరుపతికి వస్తుండగా చిగురువాడ బ్రిడ్జి వద్ద టైర్ పంక్చర్ కావడంతో అదుపుతప్పి స్వర్ణముఖి నదిలోకి దూసుకు వెళ్లింది. అదే సమయంలో అటుగా వచ్చిన కేసీపేట సర్పంచ్ పినాకపాణి మరికొందరి సాయంతో మురళిని బయటకు తీసి 108లో తిరుపతి రుయా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మరణించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు సీఐ చిన్న గోవిందు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గొంతు కోసిన కేసులో దంపతుల అరెస్టు

చిత్తూరు అర్బన్ : వరుసకు పెద్దమ్మ అయ్యే మహిళ గొంతు కోసిన కేసులో దంపతులు జ్యోతిక, నరేంద్రను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మూడు రోజుల క్రితం నగరంలోని తేనబండకు చెందిన గాయత్రీ అనే మహిళను ఆమె చెల్లెలు కొడుకు నరేంద్ర కత్తితో గొంతుకోసి.. తాను సైతం కత్తితో చేతిపై కోసుకున్నాడు. తీవ్రంగా గాయపడ్డ బాధితురాలు తిరుపతి ఆసుపత్రిలో కోలుకుంటోంది. ఈ ఘటనలో గాయత్రీ భర్త గోపినాథ్ ఇచ్చిన ఫిర్యాదుపై హత్యాయత్నం కేసు నమోదు చేసిన చిత్తూరు టూటౌన్ పోలీసులు నరేంద్రతో పాటు ఈ ఘటనకు పురిగొలిపిన అతడి భార్య జ్యోతికను సైతం అరెస్టు చేశారు.

జీఎస్టీ తగ్గింపుపై అవగాహన

చిత్తూరు కలెక్టరేట్ : జీఎస్టీ తగ్గింపుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. తగ్గిన జీఎస్టీ వివరాలను రైతులకు తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. జీఎస్టీ తగ్గుదలతో కలిగే లాభాలను రైతులకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కల్పించాలన్నారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపుతో వ్యవసాయ రంగానికి మరింత ఊతమని తెలిపారు. రైతులు వినియోగించే వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ తగ్గింపుతో మరింత లాభం చేకూరుతుందన్నారు. సెప్టెంబర్ 22 నుంచి కొత్త జీఎస్టీ శ్లాబులు అమల్లోకి వచ్చాయన్నారు. జీఎస్టీ తగ్గింపుపై వ్యవసాయ రంగంలో కలిగే ప్రయోజనాలను అవగాహన కల్పించాలన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన వ్యవసాయ పరికరాల స్టాల్స్‌లో జీఎస్టీ తగ్గింపుతో కలిగే ప్రయోజనాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఎమ్మెల్యేలు గురజాల జగన్‌మోహన్, మురళీమోహన్, నగర మేయర్ అముద, జిల్లా వ్యవసాయశాఖ, అనుబంధ శాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, పద్మావతి, రవికుమార్‌రెడ్డి, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం


మాట్లాడుతున్న ఎస్పీ తుషార్‌డూడి

గుడిపాల : రక్తదానం చేసి ప్రాణ రక్షకుడిగా మారి నిజమైన హీరో అవ్వాలని చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్‌డూడి అన్నారు. బుధవారం స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా చీలాపల్లె వద్ద ఉన్న సీఎంసీ ఆసుపత్రిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం ప్రాముఖ్యం వివరించారు. రక్తం కృత్రిమంగా తయారు చేయలేని అత్యంత విలువైన బహుమతి అని, ఒకరి రక్తదానం మరొకరి ప్రాణాన్ని నిలబెట్టే మహోన్నతమైన సేవ అని చెప్పారు. అరుదైన రక్త గ్రూప్ కలిగిన దాతలు సమాజానికి నిజమైన ప్రాణ రక్షకులని అభినందించారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మొక్కలను నాటారు. అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సిఎంసీ ఆస్పత్రి అసోసియేట్ డైరెక్టర్ ఉదయ్ జకారియా, మెడికల్ సూపరింటెండెంట్ అలెక్స్, రక్తశాస్త్రం హెడ్ డాక్టర్ డాలి, నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ నిర్మల మార్గరెట్, సీఎంసీ ఆసుపత్రి అడ్మిన్ ప్రిన్స్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, వెస్ట్ సీఐ శ్రీధర్‌నాయుడు పాల్గొన్నారు.

సామాజిక విలువలకు ప్రతీక

చిత్తూరు అర్బన్ : చెడుపై మంచి సాధించిన విజయమే విజయదశమి అని.. ఇది ధార్మిక, సామాజిక విలువలకు ప్రతీకని చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ పేర్కొన్నారు. కుటుంబ సఖ్యతను గౌరవించడం, సంప్రదాయాలను పాటించడం, సమాజంలో ఐక్యతను పెంపొందించడానికి ప్రజలంతా ఒకరికొకరు సహకరించుకోవాలన్నారు. ఈ దశమిను అందరూ సురక్షితంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.